క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దోమ: మండల పరిధి దిర్సంపల్లి, గుండాల సబ్‌స్టేషన్ల మరమ్మతు కారణంగా ఆయా గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ కిషోర్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగ దారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఘనంగా శని త్రయోదశి


పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే తదితరులు

యాలాల: శని త్రయోదశి సందర్భంగా సంగెం కుర్దు సంగమేశ్వరాలయంలో శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, భక్తులు పూజలు చేశారు. అనంతరం శనేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని, భక్తితోనే ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. ఆయనతో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

శ్రీవారికి అభిషేకం


విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్: పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి, పూలతో స్వామి వారికి విశేషంగా అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కుల్కచర్ల: మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్య అధికారులు వెంకటయ్య, జయమ్మ సూచించారు. శనివారం మండల పరిధి కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి ఆధ్వర్యంలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకోవాలని, ముఖ్యంగా బాలింతలు అంగన్‌వాడీ సెంటర్లో ఇచ్చే పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనూష తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి దక్కడం కష్టమే..

- కూరగాయలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి
- రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి



బంట్వారం: కూరగాయలకు కనీస మద్దతు ధర కిలోకు రూ.30 చొప్పున ప్రకటించి, నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. హార్టికల్చర్ సాగు రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతున్నా.. మార్కెట్‌లో ధర లేక, పెట్టుబడులు కూడా దక్కడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఓల్డ్ బోయినిపల్లి, గుడిమల్కాపూర్, మూసాపేట ఓల్‌సెల్ మార్కెట్‌లో 25 కేజీల టమాట బాక్స్ రూ.వంద పలుకుతుందన్నారు. వినియోగదారులు అదే టమాటను రైతు బజారులో కొనుగోలు చేస్తే కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.

దళారీ వ్యవస్థను అరికట్టాలి

నగరంలోని రైతు బజార్లలో వ్యాపారులే తిష్ట వేశారని, నిజమైన రైతులు కూరగాయలు విక్రయించేందుకు వెళ్తే.. రోడ్డుపై కూర్చోవాల్సి వస్తుందని రాజిరెడ్డి తెలిపారు. ప్రతి కూరగాయకు కనీస మద్దతు ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. హోల్‌సెల్ మార్కెట్లో దళారీ వ్యవస్థను అరికట్టి, రైతు బజార్లలో రైతులనే అనుమతించాలన్నారు. ఇదే విషయమై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి, సమస్యను విన్నవిస్తానని వెల్లడించారు.

లక్ష్యం దిశగా పరుగు

ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్

- ముంచుకొస్తున్న గడువు
- టార్గెట్ చేరువకు ముమ్మర యత్నం
- ఇంటింటికీ తిరుగుతున్న కార్యదర్శులు, అధికారులు


మోత్కుర్‌లో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి తదితరులు

జిల్లాలో ఇంటి పన్ను వసూలు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో లక్ష్యం చేరువయ్యేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జీపీ కార్యదర్శులతో పాటు, ప్రత్యేక అధికారులు ఇంటింటికీ వెళ్తున్నారు. ఆస్తి పన్ను చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరుతున్నారు.

దోమ: ఇంటి పన్ను వసూలు ముమ్మరంగా కొనసాగుతోంది. మార్చితో గడువు ముగియనుండటంతో లక్ష్యం చేరుకునేందుకు అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 18 మండలాలు ఉండగా.. అందులో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8.51 కోట్ల ఆస్తి పన్ను పంచాయతీలకు సమకూరాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కాస్త ఇబ్బందులు తలెత్తినా, అనంతరం పన్ను వసూలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.6.33 కోట్లు వసూలు కాగా.. మిగతా రూ.2.18 కోట్లు ప్రజల నుంచి రాబట్టాల్సి ఉంది.

మండలంలో 68 శాతం పూర్తి

దోమ మండలంలో 36 పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.43.94 లక్షల పన్ను జీపీకి రావాల్సి ఉంది. ఇందులో రూ.29.49 లక్షలు (68శాతం) వసూలయింది. మిగతా రూ.14.45 లక్షలు వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

85శాతం వసూలు

31తో ముగియనున్న గడువు

అనంతగిరి: ఈ ఏడాది వికారాబాద్ మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్ను వసూలుకు అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇందుకు ప్రత్యేక దృష్టి సారించి, 100శాతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పట్టణంలో మొత్తం 14,539 నివాసాలు ఉన్నాయి. ఇందుకు గాను ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ.3.38కోట్లు రావాల్సి ఉండగా.. ఇప్పటికి రూ.3.02 కోట్లు వసూలు అయ్యాయి. మొత్తం ప్రాపర్టీ టాక్స్ 85శాతం వసూలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. ఇదిలా ఉండగా.. ప్రాపర్టీ టాక్స్ వసూలుకు మున్సిపల్ అధికారుల బృందం నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. నిత్యం ఉదయం 8గంటల నుంచే ప్రక్రియ మొదలు పెడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి.. పన్ను వసూలు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు సైతం ప్రత్యేక బృందాలను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ఆదేశాలు, సూచనలు ఇస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా రెండుమూడేళ్లుగా పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. గత సంవత్సరం బకాయి ఇంకా రూ.18లక్షలు రావాల్సి ఉంది.

ప్రత్యేక దృష్టి



ఇంటి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇంటింటికీ పన్ను చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అధికారులు నిర్దేశించిన గడువులోగా వందశాతం పన్ను రాబట్టేందుకు కృషి చేస్తాం.

– సంతోషి, పంచాయతీ కార్యదర్శి, పాలేపల్లి

గడువులోగా లక్ష్యం చేరుకుంటాం



ఈ ఏడాది పన్ను వసూలు మండలంలో నేటికి 68 శాతం పూర్తయింది. నెలాఖరులోగా వందశాతం వసూలు అయ్యేలా కృషి చేస్తున్నాం. అందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పింస్తున్నారు. ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

– సోమలింగం, ఎంపీఓ, దోమ

ప్రజలు సహకరించాలి



ఈ నెల 31లోగా ప్రజలు తమ ఆస్తి పన్ను చెల్లించాలి. సకాలంలో బకాయిలు కట్టి, పట్టణాభివృద్ధికి సహకరించాలి. ఇప్పటివరకు మొత్తం ప్రాపర్టీ ట్యాక్స్ 85శాతం వసూలు అయింది. మిగిలినది గడువులోగా రాబట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇందుకు ప్రజల సహకారం చాలా అవసరం.

– జాకీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు


ముఖ్యమంత్రితో కాంగ్రెస్ నాయకులు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మండల పరిధి పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు. సీఎంను కలిసిన వారిలో మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, బాల్‌రెడ్డి, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, దత్తు తదితరులు ఉన్నారు.


సీఎంతో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు

ఆర్టీసీ రాష్ట్ర కార్యదర్శి..

పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ (ఆర్టీసీ) రాష్ట్ర కార్యదర్శి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ కుటుంబ సమేతంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటన సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

పోరాటయోధులకు ఘన నివాళి


పరిగి: సీపీఎం ఆధ్వర్యంలో మహనీయుల వర్ధంతి

పరిగి: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను భారతీయులు ఎన్నడూ మరిచిపోరని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా శనివారం ఆ మహనీయుల చిత్రపటాలకు పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. చిన్న వయస్సులోనే ఆ ముగ్గురు మహావీరులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి దేశ స్వాతంత్య్రం కోసం తెల్లవారితో పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సత్తయ్య, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్: నివాళులర్పిస్తున్న బీసీ సేన నాయకులు

దేశ భక్తులకు నివాళి

కొడంగల్: దేశానికి స్వేచ్ఛావాయువులు తెచ్చిన మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు అని బీసీసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పోరాట యోధుల వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో వారి చిత్రపటాలకు ఆయన నివాళులర్పించారు. సీపీఐ నాయకులు ఇందనూర్ బషీర్, మహమూద్ ఆధ్వర్యంలో పట్టణంలో మహనీయకులకు నివాళులర్పించారు. మూతుల రాజు, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భక్తుల విరాళం

కొడంగల్: పట్టణ శివారు బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు భక్తులు శనివారం విరాళాలు అందజేశారు. కొడంగల్ మున్సిపల్ ఆరో వార్డు కౌన్సిలర్ డాక్టర్ శ్రీలత యాదవ్, డాక్టర్ రవీంద్ర యాదవ్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యుడు గురుస్వామి ఉమాపతి గౌడ్‌కు రూ.లక్షన్నర అందజేశారు. అలాగే పట్టణానికి చెందిన వ్యాపారి జగదీశ్‌కుమార్ రూ.లక్ష ఇచ్చారు. ఈ పవిత్ర కార్యక్రమంలో తమ కుటుంబం భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామని కౌన్సిలర్ దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. గుడి నిర్మాణం వేగవంతంగా సాగుతుందని, ప్రస్తుతం గర్భగుడి పనులు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.


విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ దంపతులు

తమిళనాడు నుంచి నిర్మాణ సామగ్రి వచ్చిందని చెప్పారు. పెద్ద మొత్తంలో వ్యయం అవుతుందని, దాతలు సహకరించి, తమవంతు విరాళాలు ఇస్తే.. ఆలయం త్వరగా పూర్తవుతుందని వెల్లడించారు.

సృజనాత్మకత పెంపొందించేందుకే..



విద్యార్థులతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

యాలాల: చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు ఇందోలు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం శిక్షణ ఫౌండేషన్, ప్రైజ్ వాటర్‌హౌజ్ కూపర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మండల పరిధి 31 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా.. నాలుగు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. అక్కంపల్లి ప్రాథమిక పాఠశాల జట్టు విజేతగా నిలవగా, కోకట్ పాఠశాల రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు శ్రీధర్‌రెడ్డి జ్ఞాపికతో పాటు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ పోటీలతో చిన్నారుల్లో పోటీతత్వం, వేగం, సమయస్ఫూర్తి అలవడుతుందని చెప్పారు. ప్రేరణతో పాటు అభ్యసన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు తుల్జప్ప, యాదప్ప, నర్సింహులు, ఉపాధ్యాయులు ఆశప్ప, వెంకటమ్మ, గోపాల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపు అత్యవసరం

- తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తప్పనిసరి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బట్టు లలిత
- పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ: ఏఈఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

మర్పల్లి: ఈ ఏడు వర్షాపాతం తక్కువగా నమోదయిందని, నీటిని పొదుపుగా వాడుకుంటేనే ఈ వేసవి కాలం నుంచి గట్టెక్కుతామని ఎంపీపీ బట్టు లలిత అన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత ఎండలకు భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారులు, జీపీ కార్యదర్శులకు ఎంపీపీ సూచించారు. మిషన్ భగీరథ నీటి వృథాను అరికట్టాలని సూచించారు.

బ్యాంకు ఖాతాలో పెట్టుబడి సాయం

పంచాయతి రాజ్ శాఖ ఏఈ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రతి గ్రామంలో సీసీరోడ్ల పనులు పూర్తి చేయించామని వెల్లడించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ మాధవి మాట్లాడుతూ.. రైతులు యాసంగిలో సాగు చేసుకునేందుకు పెట్టుబడి సాయం కింద (4 ఎకరాలకు సంబంధించి) ప్రభుత్వం వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసిందని చెప్పారు. మిగతా రైతులకు త్వరలో రైతుబంధు రానుందని పేర్కొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని మూల మలుపులో చింత చెట్టు ప్రమాదకరంగా ఉందని, దానిని తొలగించేందుకు రెవెన్యూ, ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్‌ఎంపీపీ మోహన్‌రెడ్డి కోరారు. అదే విధంగా బీసీ హాస్టల్ సమీప కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి, కరెంట్ సరఫరా చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ.. ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే.. సబ్సిడీ వస్తుందని చెప్పారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖ ఎజెండా అంశాలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సోయెల్, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీఓ రాజమల్లయ్య, సూపరింటెండెంట్ కృష్ణారావు, కల్‌ఖోడ వెటర్నరీ డాక్టర్ హరిప్రియ, ఏపీఎం మధుకర్, గ్రామాల ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఇంటివద్దే ఓటింగ్

- అర్హులు 12డి ఫారంతో దరఖాస్తు చేసుకోవాలి
- ఈసీ నిబంధనలు అందరూ పాటించాలి
- ఏప్రిల్ 18 వరకు కొత్త ఓటర్ల నమోదు
- తహసీల్దార్లు తారాసింగ్, విజయ్‌కుమార్


కొడంగల్: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్


తాండూరు రూరల్: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: సీనియర్ సిటిజన్లతో పాటు వికలాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శనివారం తహసీల్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. 85 సంవత్సరాలు వయస్సు పైబడిన వారితో పాటు 40 శాతం అంగవైకల్యం కలిగిన ఓటర్లకు ఫారం 12(డి)ద్వారా హోం ఓటింగ్‌కు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలోని బీఎల్‌ఓల వద్ద ఫారం 12(డి) పత్రాలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన వారు ఈ ఫారంతో హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 18వ తేదీ వరకు కొత్త ఓటర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ఉద్యోగులు పాటించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐ బాల్‌రాజ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

కొడంగల్: పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాల గురించి సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించిన పనులు ఏమైనా పెండింగులో ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఫారం 12డిలను పంపిణీ చేశారు. సమావేశంలో డీటీ సురేష్, ఎన్నికల డీటీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రంగోలి

తాండూరు టౌన్: పట్టణ ప్రజలు సోమవారం హోలీ పండుగ చేసుకోవాలని హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు కామదహన కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హిందూ బంధువులందరికీ సమితి తరపున హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సభ్యులు పట్లోళ్ల నర్సింహులు, పూజారి పాండు, సిద్ధిలింగయ్య తెలిపారు.

వివాహానికి సామగ్రి పంపిణీ

కుల్కచర్ల: పేదింటి ఆడబిడ్డ వివాహానికి మాజీ సర్పంచ్ శాంతిబాయి నిత్యవసరాలు పంపిణీ చేశారు. మండల పరిధి పటేల్‌చెరువు తండా గ్రామ పంచాయతీకి చెందిన బాణవత్ రిక్కిబాయి కూతురు వివాహం సందర్భంగా శనివారం ఒక క్వింటా బియ్యం, 15కిలోల వంట నూనె, 5కిలోల పప్పు తదితర వంట సామగ్రిని ఆమె అందజేశారు. ఉమ్లానాయక్, రాము, కవిత, లక్ష్మణ్, శంకర్, పాండు, రాజు, దశరత్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

దోమ: మండల పరిధి బాస్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి నర్సమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ అనంతయ్య స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

పూడూరు: భారతీయ జనతాపార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిధి మన్నేగూడలో సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ మాజీ అధ్యక్షులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆశయ సాధనకు కృషి

అనంతగిరి: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం వికారాబాద్ ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో నాయకులు సతీష్, రామకృష్ణ, మైపాల్, చంద్రయ్య, శ్రీను, నవీన్ ఉన్నారు.

◆ 2న వేలం పాట

అనంతగిరి: అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి చెందిన (వికారాబాద్ పట్టణం ఆలంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 2లోని 2.14 ఎకరాల) భూమిని మూడు సంవత్సరాలు కౌలుకు ఇచ్చేందుకు ఏప్రిల్ 2న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరేందర్, ట్రస్టీ పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు అనంతగిరి ఆలయ ప్రాంగణంలో వేలంపాట ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు ముందుగా రూ.2వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని సూచించారు. హక్కు పొందని వారి డిపాజిట్ ఇవ్వబడుతుందన్నారు.

◆ శనేశ్వరస్వామికి పూజలు



తాండూరు రూరల్: మండల పరిధి అంతారం తండాలోని భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానంలో శనేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శని త్రయోదశి సందర్భంగా భక్తులు స్వామి వారికి తైలాభిషేకం నిర్వహించారు. ఆలయ పండితులు రవిశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మధుకర్



మర్పల్లి: బీజేపీ యువ మోర్చా మర్పల్లి మండల శాఖ అధ్యక్షుడిగా సీహెచ్ మధుకర్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. మధుకర్.. విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ కళాశాల అధ్యక్షుడిగా, జిల్లా జోనల్ ఇన్‌చార్జిగా విద్యార్థులను జాగృతం చేసేవాడని రామేశ్వర్ గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించిన బీజేవైఎం పెద్దలు.. మధుకర్‌ను అధ్యక్షుడిగా నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. బాధ్యతలు అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ హనుమాన్ చాలీసా పారాయణం



అనంతగిరి: బెంగళూరులో జరిగిన ఘటనకు నిరసనగా శనివారం వికారాబాద్ పట్టణం కొత్తగంజ్ హనుమాన్ మందిరంలో హిందూ సమాజం ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా చేయవద్దని సూచించారు.

◆ సస్యరక్షణతో అధిక దిగుబడి

బంట్వారం: సమగ్ర సస్యరక్షణతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ వినోద్‌కుమార్ అన్నారు. యాసంగి పంట నమోదులో భాగంగా శనివారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధి పలు గ్రామాల్లో పర్యటించి, వివరాలు సేకరించారు. రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. పురుగు మందులు, రసాయనాల వాడకాన్ని తగ్గించాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

◆ మొక్కజొన్న దిగుబడితో వ్యవసాయ మార్కెట్ కళకళ

ధారూరు: మొక్కజొన్న రైతులు వ్యవసాయ మార్కెట్‌కు 304 బస్తాల దిగుబడిని తీసుకువచ్చారని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాల్ ధర రూ.2,250 నుంచి రూ.2,275 వెచ్చించి కొనుగోలు చేసినట్లు ఆమె చెప్పారు. అలాగే కందులు 100 బస్తాలు వచ్చాయని, క్వింటాకు రూ.10,200 నుంచి రూ.10,400 వరకు ధర పలికిందని పేర్కొన్నారు. వేరుశనగ 50 బస్తాలు రాగా.. క్వింటాకు రూ.6,300 నుంచి రూ.6,900 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని కార్యదర్శి వెల్లడించారు. కందులకు ఎక్కువ ధర వస్తుందన్న ఆశతో కొంతమంది రైతులు విక్రయించడం లేదని ఆమె వెల్లడించారు.